సాక్షి
కుమురం భీం
గురువారం । 11 । జూలై । 2024



ప్రభం'జనం'

అపరిమితంగా పెరుగుతున్న జనాభాకు ఆహారం, నివాసం కల్పించడం కష్టతరమవుతోంది. నేడు 'ప్రపంచ జనాభా దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం. 8లో▸



కనీస వేతనం అమలు చేయాలి

కనీస వేతనం అమలు చేయాలని అంగన్‌వాడీ ఉద్యోగులు కోరారు. డిమాండ్ డే సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.5 /26.8

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఆంజనేయులుగౌడ్

రెబ్బెన(ఆసిఫాబాద్): గోలేటి ఓసీపీలో భూములు కోల్పోతున్న వారికి న్యాయం చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి కేసరి ఆంజనేయులుగౌడ్ కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని కలిసి గోలేటి ఓసీపీలో భూములు కోల్పోతున్న సోనాపూర్, అబ్బాపూర్, గోలేటి గ్రామ రైతుల సమస్యలపై వినతిపత్రం అందించారు. ఆంజనేయులుగౌడ్ మాట్లాడుతూ సింగరేణిలో భూములు కోల్పోతున్న బాధిత కుటుంబంలో ఒకరికి సంస్థలో ఉద్యోగం ఇవ్వడంతోపాటు మార్కెట్ ధరల ప్రకారం ఎకరానికి రూ.20లక్షలు చెల్లించాలని కోరారు. ఎన్నో ఏళ్ల నుంచి భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసీ గిరిజన రైతులతోపాటు ఎస్సీ, బీసీ రైతులను సైతం ఆదుకోవాలన్నారు. లీగల్ సెల్ నాయకులు జుమ్మిడి రాజేశ్ ఉన్నారు.

అంగన్‌వాడీలకు ట్యాబ్‌లు అందజేత



ట్యాబ్‌లు అందిస్తున్న కలెక్టర్, తదితరులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని సఖి సెంటర్‌లో బుధవారం తిర్యాణి మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా సంక్షేమ అధికారి భాస్కర్ ట్యాబ్‌లు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ తిర్యాణి మండలంలో ఆస్పిరేషన్ బ్లాక్ ప్రోగ్రాంలో భాగంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. ఇంటర్నెట్, మొబైల్ సిగ్నల్స్ లేకపోవడంతో అంగన్‌వాడీ కేంద్రాల్లో జరుగుతున్న రోజువారీ కార్యక్రమాలను పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో నమోదు చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ నేపథ్యంలో మూడు 5జీ ట్యాబ్స్ అందజేసినట్లు తెలిపారు. అనంతరం పూర్వ ప్రాథమిక విద్య పాఠ్య ప్రణాళికపై అంగన్‌వాడీ టీచర్లకు అందిస్తున్న శిక్షణను పర్యవేక్షించారు. కార్యక్రమంలో జిల్లా శిశు అభివృద్ధి ప్రాజెక్టు అధికారి సాదియా, తిర్యాణి బ్లాక్ సమన్వయ కర్త మణివేలు, జిల్లా పోషణ్ అభియాన్ సమన్వయ కర్త గోపాల కృష్ణ, సఖి సెంటర్ సమన్వయ కర్త మమత, సూపర్‌వైజర్లు తిరుపతమ్మ, విజయ, యశోద, మాస్టర్ ట్రైనర్లు కళావతి, సింధూర, స్వప్న పాల్గొన్నారు.

మహిళా కానిస్టేబుల్‌కు సన్మానం



స్రవంతిని సన్మానిస్తున్న ఎస్పీ

ఆసిఫాబాద్‌అర్బన్: ఆలిండియా పోలీసు స్పెషల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ చూపిన మహిళా కానిస్టేబుల్ స్రవంతిని జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ శ్రీనివాసరావు ఘనంగా సన్మానించారు. జూన్ 15 నుంచి 20 వరకు తమిళనాడులో జరిగిన ఆలిండియా పోలీసు స్పెషల్ షూటింగ్ కాంపిటేషన్– 2024లో గ్లాక్ పిస్టల్ షూటింగ్‌లో స్రవంతి ఏడో ర్యాంకు సాధించారు. అలాగే తెలంగాణ స్టేట్ షూటింగ్ పోటీల్లో 25 మీటర్ల ఫైర్ ఆర్మ్ స్పోర్ట్స్ పిస్టల్ షూటింగ్ ఈవెంట్‌లో సిల్వర్ మెడల్ సాధించారు. పది మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో 400 స్కోర్‌కు 365 స్కోర్‌తో రజత పతకం సాధించారు. డీఎస్పీ కరుణాకర్, కొటాల ఎస్సై మధుకర్, సీఐ సాదిక్ పాషా, ఆర్‌ఐ అడ్మిన్ పెద్దయ్యను అభినందించారు.

25న గదులకు వేలం

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఇందిరా మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన చికెన్ సెంటర్ వెనుక ఉన్న ఆరు వాణిజ్య గదులు, మటన్ సెంటర్ వద్ద గల మరో ఐదు వాణిజ్య గదులకు ఈ నెల 25న ఉదయం 11 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వేలం ద్వారా ఐదేళ్లపాటు లీజుకు అప్పగించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 11 నుంచి 24 వరకు సాయంత్రం ఐదు గంటల్లోపు దరఖాస్తుతోపాటు రూ.25 వేల ధరావత్తు మున్సిపల్ కార్యాలయంలో చెల్లించాలన్నారు. డిపాజిట్ చెల్లించినవారు ఒక్కరు మాత్రమే వేలంలో పాల్గొనాలని సూచించారు.





హెలిప్యాడ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు

భట్టి వస్తున్నారు..

- ఉప ముఖ్యమంత్రిగా తొలిసారి జిల్లాకు..
- గతంలో 'పీపుల్స్‌మార్చ్' ఇక్కడి నుంచే
- గిరిజన సమస్యలపై విక్రమార్కకు అవగాహన
- నేడు ఉట్నూర్‌కు మంత్రివర్గ ఉపసంఘం
- 'రైతు భరోసా' వర్క్‌షాప్‌నకు హాజరు
- పాల్గొననున్న ఉమ్మడి జిల్లా రైతులు

నాడు పీపుల్స్‌మార్చ్ పాదయాత్రలో భట్టి విక్రమార్క ఉమ్మడి జిల్లాలో ప్రజలను కలిసినప్పుడు అనేక సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా ఆదివాసీలు తమకు భూమి లేదని, నీళ్లు రావడం లేదని, ఇళ్లు లేవని, రేషన్‌కార్డులు వస్తలేవని, ఉద్యోగాలు లేవని, ఇలా తమ గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై ఆయన అప్పట్లో స్పందిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజల సంక్షేమం కోసం అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. ముఖ్యంగా పేదలకు ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తామని చెప్పారు. అంతే కాకుండా పోడు భూముల సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామన్నారు. ఐటీడీఏ ద్వారా గిరిజనులకు సంక్షేమ ఫలాలు అందేలా తోడ్పాటు అందిస్తామని, అలాగే కుప్టి ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత గత మార్చి 16న భట్టి పాదయాత్ర ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా పిప్రి గ్రామంలో సభ నిర్వహించాలని భావించినప్పటికీ చివరిలో అది రద్దయింది.

ఆర్థికమంత్రిగా వరాలు కురిపించాలని..

సాక్షి,ఆదిలాబాద్: సరిగ్గా పదహారు నెలల క్రితం.. సీఎల్పీ నేతగా ఉన్న మల్లు భట్టి విక్రమార్క రాష్ట్రంలో తన పాదయాత్రను ఆదిలాబాద్ జిల్లా నుంచే ప్రారంభించారు. బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామం వద్ద 2023 మార్చి 16న షురూ చేశారు. సుమారు నెల రోజుల పాటు ఉమ్మడి జిల్లాలో కొనసాగింది. పలు నియోజకవర్గాలను దాటుకుంటూ ఏప్రిల్ 13న మంచిర్యాల జిల్లా నస్పూర్‌లో సత్యాగ్రహ సభ నిర్వహణతో ఉమ్మడి జిల్లాలో పాదయాత్ర ముగిసింది. ఈ క్రమంలో ఆయా గిరిజన ప్రాంతాల్లో ప్రజలు ఆయనను కలిసేందుకు ఆసక్తి చూపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరారు. అందుకు తగ్గట్లే మల్లు భట్టి విక్రమార్క 'వచ్చేది ప్రజా ప్రభుత్వమేనని, ఇందిరమ్మ రాజ్యంలో సమస్యలన్నీ పరిష్కరిస్తామని' ప్రజలకు భరోసా ఇచ్చారు. ఈ విషయం ఇప్పుడు ఎందుకు చెప్పాల్సి వస్తుందంటే.. పాదయాత్ర అనంతరం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉప ముఖ్యమంత్రిగా భట్టి కీలక బాధ్యతలు స్వీకరించారు. అనంతరం తొలిసారిగా జిల్లాకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన రాకను ఈ ప్రాంతవాసులు ఆసక్తిగా గమనిస్తున్నారు.

నేడు ఉట్నూర్‌లో రైతు భరోసాపై వర్క్‌షాప్..

రాష్ట్రంలో రైతు భరోసా పథకం అమలుపై విధివిధానాల రూపకల్పన కోసం ప్రభుత్వం మంత్రి వర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఇందులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు, దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను సభ్యులుగా నియమించింది. వీరు ఉమ్మడి జిల్లా వారీగా వర్క్‌షాప్ నిర్వహించి రైతుల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తున్నారు. బుధవారం తొలి సమావేశం ఖమ్మంలో చేపట్టారు. గురువారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి ఉట్నూర్‌లో నిర్వహిస్తున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. ఉదయం 10:20 గంటలకు హైదరాబాద్ నుంచి హెలికాప్టర్ ద్వారా ఉట్నూర్ చేరుకుంటారు. 10:30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రైతు భరోసా పథకంపై కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించే వర్క్‌షాప్‌లో పాల్గొంటారు. సాయంత్రం తిరిగి హైదరాబాద్ బయల్దేరి వెళ్తారు.

ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్న రైతు భరోసా వర్క్‌షాప్‌కు మంత్రివర్గ ఉపసంఘంతో పాటు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ఉమ్మడి జిల్లా నుంచి రైతులు పాల్గొనున్నారు. ఈ మేరకు కేబీ ప్రాంగణంలోని హెలిప్యాడ్, సమావేశ మందిరాలను ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే బొజ్జు పరిశీలించారు. వారి వెంట అదనపు ఎస్పీ సురేందర్‌రావు, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, డీఎస్పీ నాగేందర్, ఆర్డీవో జీవాకర్‌రెడ్డి, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ దిలీప్‌కుమార్, ఇతర శాఖల అధికారులున్నారు.

లక్ష్యం మేరకు మొక్కలు నాటాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, పక్కన అదనపు కలెక్టర్ దీపక్ తివారి, అధికారులు

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే
- మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్

ఆసిఫాబాద్: వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ నెలాఖరులోగా లక్ష్యం మేరకు మొక్కలు నాటాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఎఫ్‌వో నీరజ్‌కుమార్, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి ఎంపీడీవోలు, ఎంపీవోలు, ఉపాధిహామీ ఏపీవోలు, అటవీశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వన మహోత్సవంలో భాగంగా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖకు 35 వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించామన్నారు. శాఖల వారీగా అవసరమైన మొక్కల వివరాల నివేదిక అందించాలని ఆదేశించారు. ఉపాధిహామీ పథకం కింద కూలీల సంఖ్య పెంచి గుంతలు తవ్వించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో దోమల వృద్ధిని అరికట్టేందుకు ఆయిల్ బాల్స్ వినియోగించడంతోపాటు దోమల నివారణ మందు స్ప్రే చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వారంలోగా 'ఆదర్శ' పనులు పూర్తి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన పనులు వారంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, డీఈవో అశోక్, డీఆర్‌డీవో సురేందర్‌తో కలిసి బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 725 పాఠశాలల్లో మరమ్మతులు, అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. 50, 75 శాతం పనులు పూర్తయిన వాటికి ఎంబీ రికార్డులు పూర్తి చేసి సమర్పించాలన్నారు. ప్రతీ పాఠశాలలో విద్యుత్, తాగునీరు పనులు వందశాతం పూర్తయ్యాయని తెలిపారు. సమావేశంలో డీటీడీవో రమాదేవి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ వ్యాపారాలపై నిఘా

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: చట్టవ్యతిరేక కార్యకలాపాలు, అక్రమ వ్యాపారాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో బుధవారం పోలీసు అధికారులతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వాటిని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. దొంగతనాలు అడ్డుకునేందుకు రాత్రిపూట పెట్రోలింగ్, నిఘా వ్యవస్థను పటిష్టం చేయాలన్నారు. ప్రతీ సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీంను నియమించాలని సూచించారు. క్రమం తప్పకుండా డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు, వాహన తనిఖీలు చేపట్టాలన్నారు. బహిరంగంగా మద్యం తాగే ప్రాంతాలపై నిఘా ఉంచాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా జిల్లాలో లోతట్టు ప్రాంతాలు, వరదకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు అమర్చాలని సూచించారు. నకిలీ పత్రాలు సృష్టించి అమాయకుల వద్ద బలవంతపు వసూళ్లకు పాల్పడటం, వివాదస్పద భూములను సెటిల్ చేస్తానని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, డబ్బులు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సరిహద్దు ప్రాంతాల నుంచి గంజాయి సరఫరా చేసే వ్యక్తులను గుర్తించి కేసులు నమోదు చేయాలన్నారు. గుట్కా, ఇసుక, పేకాట, గుడుంబా, బియ్యం దందాలపై దృష్టి సారించాలని సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ప్రభాకర్‌రావు, డీఎస్పీలు సదయ్య, కరుణాకర్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఫారెస్ట్ అధికారుల కవ్వింపు చర్యలు సరికాదు

- ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు



పోడు భూములు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

కాగజ్‌నగర్‌రూరల్: పోడు భూముల విషయంలో ఫారెస్టు అధికారుల కవ్వింపు చర్యలు సరికాదని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలం కడంబా శివారులోని పోడు భూముల్లో రెండు రోజులుగా ప్లాంటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నారనే విషయం తెలుసుకుని.. బుధవారం పోడు రైతులతో కలిసి భూములను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పోలీసు బలగాలను వెంటపెట్టుకుని ఫారెస్టు అధికారులు దౌర్జన్యంగా పోడు భూములను స్వాధీనం చేసుకుని మొక్కలు నాటుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వ హామీకి వ్యతిరేకంగా అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. ఈ సంవత్సరం కొత్తగా పోడు భూములను స్వాధీనం చేసుకునేది లేదని సాక్షాత్తు ముఖ్యమంత్రే తెలిపారని, కడంబాలో మాత్రం పోడు భూములను స్వాధీనం చేసుకుని మొక్కలు నాటడం దారుణమన్నారు. పోడు రైతుల ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు కోల భీమయ్య, సాంబయ్య, బూరం రాజు, దోతుల శ్రీనివాస్, మల్లబోయిన జనార్దన్, ప్రసాద్, శేఖర్, కోటేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ దళితుల సమస్యలు పరిష్కరించాలి

జైనూర్(ఆసిఫాబాద్): ఏజెన్సీ ప్రాంతంలోని దళితులు సంక్షేమ పథకాలకు ఆమడ దూరంలో ఉన్నారని, వారి సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అంబేద్కర్, పూలే మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుద్దాల శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులతో కలిసి జీవిస్తున్న ఎస్సీ, బీసీలకు పెట్టుబడి సాయం, రైతుబీమా వంటి పథకాలు వర్తింపజేయాలని కోరారు. వివిధ సంఘాల నాయకులు మోహాశే దత్తా, అశోక్, మహేశ్, ఆనంద్‌రావు, బాబాసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత లేకుండా సర్దుబాటు

- డీఈవో అశోక్



మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్: జిల్లాలో ఇటీవల జరిగిన బదిలీలతో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత ఏర్పడిందని, అలాంటి చోట రేషనలైజేషన్ నిబంధన మేరకు సమీప పాఠశాల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తామని డీఈవో పార్శి అశోక్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో బుధవారం ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు, ఎంఎస్‌వోలతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. టీచర్ల సర్దుబాటు విషయంలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయుల సర్దుబాటును మూడు రోజుల్లో పూర్తి చేస్తామని ప్రకటించారు. పదిలోపు విద్యార్థుల ఉంటే ఒక ఉపాధ్యాయుడిని నియమిస్తామన్నారు. తప్పనిసరిగా మధ్యాహ్న భోజన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. 40 వేల మొక్కలు నాటే లక్ష్యంతో పాఠశాలల్లో వనమహోత్సవం చేపట్టాలని ఆదేశించారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తమ పరిధిలోని పాఠశాలలను సందర్శించి సమస్యలు పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏసీజీఈ ఎం.ఉదయబాబు, కోఆర్డినేటర్లు మధుకర్, అబిద్ అలీ, డీసీఈబీ కార్యదర్శి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలతో విలవిల!

- వర్షాలతో గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- చెత్త పేరుకుపోయి కంపుకొడుతున్న పరిసరాలు, డ్రెయినేజీలు
- జిల్లా కేంద్రంలోనూ స్వచ్ఛతపై దృష్టి సారించని అధికారులు
- ఆస్పత్రులకు క్యూకడుతున్న జ్వర పీడితులు



జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం

రెండు, మూడు రోజులుగా జిల్లావ్యాప్తంగా జోరుగా వర్షాలు కురుస్తుండటంతో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ముఖ్యంగా జిల్లా కేంద్రంలోని పలు కాలనీలను వరదనీరు ముంచెత్తింది. వీధుల్లో డ్రెయినేజీలు చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో నెలల తరబడి చెత్తను తొలగించడం లేదు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది జ్వరాలు వ్యాపిస్తున్నాయి. మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధుల నియంత్రణకు మున్సిపల్ సిబ్బంది చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగిస్తూ డ్రెయినేజీలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఆసిఫాబాద్: వర్షాకాలం సీజన్ ప్రారంభమైంది. సీజన్ మార్పుతో పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. దాదాపు అన్ని మండలాల్లో జ్వరాలు విజృంభిస్తున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బాధితులు పరుగులు పెడుతున్నారు. రోగుల తాకిడి పెరగడంతో వార్డులు నిండిపోయాయి. నిత్యం సుమారు 350 మందికి పైగా ఔట్‌పేషెంట్లుగా నమోదవుతున్నారు. సీజనల్ వ్యాధులు, జ్వరాలతో ఆస్పత్రి రోగులతో కిటకిటలాడుతోంది. 10 నుంచి 20 మంది ఇన్‌పేషెంట్లు చేరుతున్నారు. ముఖ్యంగా టైఫాయిడ్, మలేరియా జ్వరాలు అధికంగా ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు.

ఆస్పత్రి కిటకిట

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని బుధవారం పరిశీలించగా.. అనేక మంది జ్వరాలతో చికిత్స పొందుతూ కనిపించారు. జిల్లా కేంద్రానికి చెందిన అశ్విన్, వాంకిడి మండలం తేజిగూడకు చెందిన శెండె లక్ష్మణ్, జన్కాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్, ఆసిఫాబాద్ మండలం కొడియన్ మోవాడ్‌కు చెందిన ఆత్రం మారుబాయి జ్వరంతో ఆస్పత్రిలో చేరారు. ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన మెకర్తి రామయ్య, వెంకటేశం విరేచనాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు పలువురు జ్వరం, కడుపునొప్పి, ఇతర వ్యాధులతో ఆస్పత్రిలో చేరారు. మొత్తం 30 మంది ఇన్‌పేషెంట్లుగా చికిత్స పొందుతున్నారు. వీరితోపాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ప్రజలు చికిత్స పొందుతున్నారు. ఆస్పత్రిలో వాంతులు, విరోచనాలు, నొప్పులకు సంబంధించిన మందులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు బయట నుంచి కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రి డీసీహెచ్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ మధ్య సమన్వయం లేకపోవడంతో రోగులకు అవసరమైన మందులు తెప్పించడం లేదని సమాచారం. ప్రభుత్వ ఆస్పత్రిలోని వార్డుల్లోని టాయిలెట్లు కంపు కొడుతున్నట్లు రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్యవేక్షణ కరువు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందిపై పర్యవేక్షణ కొరవడింది. వంతుల వారీగా విధులు నిర్వర్తించాల్సిన వైద్యులు ఒకేసారి వచ్చి వేలి ముద్రలు వేస్తున్నట్లు ఆస్పత్రికి చెందిన ఓ వైద్యుడు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఉన్నతాధికారుల వేధింపులతో సదరు వైద్యుడు రాజీనామా చేసినట్లు సమాచారం. 68 మంది వైద్యులు ఉండాల్సిన ప్రభుత్వ ఆస్పత్రిలో ఎప్పుడు ఎవరు వస్తున్నారో.. వెళ్తున్నారో తెలియడం లేదు. రోగులకు మెరుగైన వైద్యం అందక ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఈ ఆస్పత్రిలో ప్రతినెలా సుమారు 40 కాన్పులు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిలో ఆపరేషన్ థియేటర్, గైనకాలజిస్టు, మత్తు డాక్టర్ ఉన్నప్పటికీ అత్యవసర పరిస్థితుల్లో శస్త్రచికిత్స చేయడం లేదు. గత నెలలో ఆస్పత్రిలో ఓ మహిళకు సిజేరియన్ ద్వారా కాన్పు చేశారు. ఆ తర్వాత నుంచి మళ్లీ సాధారణ కాన్పులే జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రిపై భరోసా కల్పించకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులకు క్యూకడుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- డీఎంహెచ్‌వో తుకారాం భట్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో తుకారాం

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్యసిబ్బంది గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో తుకారాం భట్ అన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బుధవారం మెడికల్ ఆఫీసర్లు, సూపర్‌వైజర్లు, సిబ్బందితో సమావేశమయ్యారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ దోమల నివారణకు మురుగు నీటి ప్రవాహాల్లో ఆయిల్‌బాల్స్ వేయాలన్నారు. గ్రామాల్లో ప్రతీ మంగళ, శుక్రవారాల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించాలన్నారు. యాక్టివ్ సర్వేలెన్స్‌లో భాగంగా ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు గ్రామాల్లో పదిశాతం రక్త నమూనాలు సేకరించాలని ఆదేశించారు. ర్యాపిడ్ మాస్ సర్వేలెన్స్‌లో భాగంగా దూర ప్రాంతాల్లో ఉండేవారి రక్తనమూనాలు సేకరించాలన్నారు. అలాగే డెంగీ కేసుల నిర్ధారణ కోసం శాంపిల్స్ టీహబ్‌కు పంపించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్, పీవోఎంసీ సిద్దార్థ, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి వినోద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలోని అందుగులపేట సమీపంలో జాతీయ రహదారిపై బుధవారం జరిగిన ప్రమాదంలో సంద్ర ధర్మయ్య (42)అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం అందుగులపేటకు చెందిన ధర్మయ్య పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు దాటుతుండగా బొలేరో వాహనం ఢీకొట్టింది.

మృతదేహాన్ని ఢీకొట్టి..

ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మంచిర్యాలలోని రాజీవ్‌నగర్‌కు చెందిన బత్తుల శ్రీకాంత్ రోడ్డుపై పడి ఉన్న ధర్మయ్య మృతదేహాన్ని ఢీకొట్టి కిందపడడంతో గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రున్ని మంచిర్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బావిలో దూకి ఆత్మహత్య

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని మారుతినగర్‌కు చెందిన రాంటెంకి శ్రీకాంత్ (24) బుధవారం బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. నాలుగేళ్ల క్రితం మంచిర్యాలకు చెందిన మౌనికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఏడాదికే భార్య మృతి చెందడంతో మద్యానికి బానిసయ్యాడు. జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

బైక్ పైనుంచి పడి ఒకరి మృతి

దండేపల్లి: మండల కేంద్రంలోని తాళ్లపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో జన్నారం మండలం రాంపూర్‌కు చెందిన ఎడ్ల శంకరయ్య (74)కు గాయాలుకాగా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. శంకరయ్య రాంపూర్ గ్రామానికి చెందిన రాకేష్‌తో కలిసి మంగళవారం పని నిమిత్తం బైక్‌పై లక్సెట్టిపేటకు వెళ్లారు. రాత్రి ఇంటికి తిరిగి వస్తుండగా తాళ్లపేట పీహెచ్‌సీ సమీపంలో బైక్‌కు అడ్డువచ్చిన పందిని ఢీకొట్టడంతో కిందపడిపోయారు. శంకరయ్య తలకు బలమైన గాయం కావడంతో 108లో లక్సెట్టిపేటకు, మెరుగైన వైద్యంకోసం కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని కుమారుడు లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

హాస్టల్ భవనం పైనుంచి దూకిన విద్యార్థిని



చికిత్స పొందుతున్న విద్యార్థిని

నస్పూర్: హాస్టల్‌లో చేర్పించిన తండ్రి ఇంటికి తీసుకెళ్లలేదని, ఎలాగైనా ఇంటికి వెళ్లాలన్న ఆత్రుతలో ఓ విద్యార్థిని హాస్టల్ బిల్డింగ్ పైనుంచి కిందికి దూకి గాయాలపాలైన సంఘటన నస్పూర్‌లో చోటు చేసుకుంది. జిల్లా కేంద్రంలోని కాలేజ్‌రోడ్‌లో ఉంటున్న అల్వాల లక్ష్మణ్ కుమార్తె అక్షరను ఇటీవల నస్పూర్‌లోని కేజీబీవీలో ఆరోతరగతిలో జాయిన్ చేశారు. తండ్రి లక్ష్మణ్ మంగళవారం కూతుర్ని చూడడానికి హాస్టల్‌కు వెళ్లాడు. తనకు ఇంటిపై బెంగగా ఉందని, ఇంటికి తీసుకెళ్లమని కోరింది. ఇందుకు తండ్రి నిరాకరించాడు. దీంతో బుధవారం ఉదయం స్నానం చేసేందుకు వెళ్లి హాస్టల్ రెండవ అంతస్తు నుండి దూకి బయటకు వెళ్లే ప్రయత్నం చేసింది. గమనించిన హాస్టల్ సిబ్బంది మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని వెన్నుముకకు గాయం కావడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తరలించారు.



ప్రభంజనం

ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో విశాలమైన గృహాలు, భవంతుల్లో కుటుంబ సభ్యులు నివాసముండేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితులు మారిపోతున్నాయి. క్రమంగా పట్టణీకరణ పెరుగుతుండడంతో పట్టణాలు, నగరాల్లో ఇరుకు గదుల్లో, సరైన వసతులు లేని నివాసగృహాల్లో బతుకులు వెళ్లదీస్తున్నారు. ఇక పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాల పరిస్థితులు చెప్పనక్కర్లేదు. దీనికంతటికీ కారణం నానాటికీ పెరుగుతున్న జనాభా. భూమిపై పరిమితంగా ఉన్న సహజ వనరులు వినియోగించుకుంటూ అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాకు ఆహారం నివాసం కల్పించుకోవడం కష్టతరమవుతోంది. దీనికి తోడు వ్యవసాయ భూములు సైతం నివాస సముదాయాలుగా మారుతున్నాయి. అటవీ విస్తీర్ణం కూడా క్రమంగా తగ్గుతోంది. రానున్న రోజుల్లో పరిస్థితులు మరింత క్లిష్టతరమవుతాయన్న సంకేతాలు వెలువడుతున్నాయి. దీనికంతటికీ పరిష్కారమార్గం అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాను అరికట్టడమే. 1987 జూలై 11న ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకుంది. ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ఏటా జూలై 11న 'ప్రపంచ జనాభా దినోత్సవం' జరుపుకుంటున్నాం.

- మితిమీరితే అనర్థమే..
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా
- ఉమ్మడి జిల్లాలోనూ 30 లక్షలకు చేరువగా..
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

తెలంగాణ రాష్ట్ర ప్రణాళికాభివృద్ధి సంస్థ విడుదల చేసిన 2021 గణాంకాల ప్రకారం..

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ)	జనసాంద్రత (కి.మీ)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115

మితిమీరితే ఏర్పడే సమస్యలు

- జనాభా పెరుగుదలతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది.
- అడవులు అంతరించిపోతాయి.
- జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. నిరుద్యోగం పెనుసమస్యగా పరిణమిస్తుంది.
- ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బంది పెడతాయి.
- భవిష్యత్ అవసరాలకు ఆటంకంగా మారుతుంది.
- జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి.

నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై..వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నాయి. సహజ వనరుల్ని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, ఆర్థికంగా కుంగిపోవడం, నిరక్షరాస్యత, అవసరాలు తీరకపోవడం, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించి స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారమవుతాం.

ప్రభుత్వాలు ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా..

జనాభా పెరుగుదల నియంత్రించాలని ప్రభుత్వాలు అనేక ఏళ్లుగా ప్రయత్నాలు చేస్తున్నా సరైన ప్రతిస్పందన కనిపించడం లేదని విశ్లేషకులు పేర్కొంటున్నారు. జనాభా నియంత్రణ అనేది స్వీయ ఆచరణ నుండి రావాలని ఒక మతం, ఒక వర్గం నుండే కాకుండా అందరూ ఆచరణలో అమలు చేయాలని స్పష్టం చేస్తున్నారు. మరోవైపు మానవ వనరులను పెంచుకుంటూపోతే ప్రపంచీకరణలో భాగంగా ఎక్కడైనా మనుగడ సాగించగలుగుతాడని.. ప్రభుత్వాలు, పాలకులు చేయాల్సింది మౌలిక సదుపాయాలు కల్పించడమేనని మరోవైపు వాదిస్తున్నారు.

పెరుగుతున్న నిరుద్యోగం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 30 లక్షలకు పైగా జనాభా ఉండగా ఇందులో 60 శాతానికిపైగా యువత, వయోజనులే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో ఏ చిన్న ఉద్యోగ నోటిఫికేషన్ వెలువడినా వేలాదిమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటున్నారు. దీంతో విపరీతమైన పోటీ నెలకొంటోంది. ప్రైవేటు రంగంలోనూ విపరీతమైన పోటీ ఉంటోంది. చిన్నాచితకా ఉద్యోగాలకు కూడా వందల సంఖ్యలో అభ్యర్థులు పోటీ పడుతున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కరువై వేలసంఖ్యలో యువత గల్ఫ్ దేశాలకు పయనమవుతూ వలస కార్మికులుగా మారుతున్నారు. దీనికంతటికీ ప్రధాన కారణం పెరుగుతున్న జనాభా అని గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. జనాభా పెరుగుదల వల్ల నివాస సముదాయాలు పెరిగిపోవడం రియల్ ఎస్టేట్ రంగం కూడా వ్యాప్తి చెందుతుంది. క్రమంగా అటవీ విస్తీర్ణం కూడా తగ్గిపోయే పరిస్థితులు నెలకొంటున్నాయి.

చదరపు కిలోమీటర్‌కు సగటున 175 మంది...

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా 16,101.98 చదరపు కిలోమీటర్ల వైశాల్యం కలిగిఉండగా 2021 జనాభా లెక్కల ప్రకారం 27,41,239 మంది జనాభా ఉన్నారు. ఈ లెక్కన ఒక చదరపు కిలోమీటర్‌కు జనసాంద్రత 175 నమోదై ఉంది. నిర్మల్ జిల్లాలో 7,09,000, ఆదిలాబాద్ జిల్లాలో 7,08,000, మంచిర్యాల జిల్లాలో 8,07,000, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 5,15,000కు పైగా జనాభా నివసిస్తున్నారు. మంచిర్యాల జిల్లా అత్యధికంగా ఒక చదరపు కిలోమీటర్‌కు 207, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా అత్యల్పంగా 115 మంది జనసాంద్రతను కలిగి ఉన్నాయి.

నియంత్రణ అవసరం



పరిమిత వనరులున్న మనదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు.. ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

గల్ఫ్‌బాటలో యువత..



ఉమ్మడి జిల్లాలో ఏటా పెరుగుతున్న జనాభా దృష్ట్యా నిరుద్యోగ రేటు కూడా పెరుగుతోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 50 వేలకు పైగా మంది గల్ఫ్ దేశాల్లో కుటుంబాలకు దూరంగా జీవనం కొనసాగిస్తున్నారు. ఇక్కడి మానవ వనరులను సరైన విధంగా వినియోగించుకునే మార్గాలను మన ప్రభుత్వాలు అన్వేషిస్తేనే వలసలు ఆగుతాయి.– స్వదేశ్ పరికిపండ్ల, గల్ఫ్ సంఘాల నాయకుడు, నిర్మల్

బాధ్యతలు స్వీకరించిన జనక్‌ప్రసాద్



జనక్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న నేతలు

శ్రీరాంపూర్: రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్‌గా ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ బీ.జనక్ ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో లేబర్ కమిషనర్ ఆదిత్య చేతుల మీదుగా బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్ సింగ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శ్రీరాంపూర్ నుంచి పలువురు ఐఎన్‌టీయూసీ నేతలు హాజరై జనక్‌ప్రసాద్‌ను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు జే శంకర్‌రావు, జాతీయ సమితి సభ్యులు భీంరావు, కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేని శ్యాం, డెప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, బ్రాంచి నాయకులు ల్యాగల శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, ఏనుగు రవీందర్‌రెడ్డి, మల్లారెడ్డి, వెంగళ కుమారస్వామి, నర్సింగ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ రెస్టారెంట్‌లో మంగళవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించి తొమ్మిది మంది పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. తమకు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.1,78,030 నగదు స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ బుధవారం ఓ ప్రకటనలో సంబంధిత వివరాలు వెల్లడించారు.. తమకు అందిన సమాచారం మేరకు స్థానిక స్వాగత్ ఫ్రైడ్ రెస్టారెంట్‌పై దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న స్థానిక గౌతమి నగర్‌కు చెందిన పోటు మాధవరెడ్డి, కంది దామోదర్‌రెడ్డి, సిరికొండ కొండల్‌రావ్, గంగవరపు వెంకటేశ్వర్లు, రాంనగర్‌కు చెందిన గుర్రం జనకరెడ్డి, మారుతి నగర్‌కు చెందిన పల్లపు తిరుపతి, రెడ్డి కాలనీకి చెందిన గుండు శ్రీధర్, ఎస్.శ్రీనివాస్, గోదావరిఖనికి చెందిన అల్లం సంపత్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారంతా జిల్లా కేంద్రంలోని ప్రముఖులు కావడం చర్చనీయాంశంగా మారింది.

ప్రతీ ఉద్యోగి రక్షణపై శ్రద్ధ చూపాలి



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

శ్రీరాంపూర్: ప్రతి ఉద్యోగి తన రక్షణపై శ్రద్ధపెట్టి పనిచేయాలని కార్పొరేట్ జీఎం(సేఫ్టీ) కే గురువయ్య తెలిపారు. బుధవారం ఆర్కే 5 గనిపై ఆయన ఉద్యోగులతో రక్షణపై మాట్లాడారు. రక్షణ నియమాలు పాటిస్తూ పని చేయాలన్నారు. బొగ్గు ఉత్పత్తి ఎంత ముఖ్యమో రక్షణ కూడా అంతే ముఖ్యమన్నారు. పని ప్రదేశాల్లో ప్రతి ఉద్యోగి తన వ్యక్తిగత రక్షణతో పాటు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధన కోసం కృషి చేయాలన్నారు. ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న ఆయన్ను ఏరియా ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, తదితరులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్వోటూజీఎం గోపాల్ సింగ్, బెల్లంపల్లి రీజియన్ సేఫ్టీ జీఎం రఘుకుమార్, ఏరియా సేఫ్టీ అధికారి శ్రీధర్‌రావు, ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్‌ఖాదీర్, రక్షణాధికారి శివయ్య, సంక్షేమ అధికారి రణదీప్‌గౌడ్, పిట్ సెక్రెటరీ నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

వాంకిడి: రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన ఘటన బుధవారం మండలంలోని జాతీయ రహదారి-363పై చోటు చేసుకుంది. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆసిఫాబాద్ వైపు నుంచి మహారాష్ట్ర వెళ్తున్న లారీ గణేశ్‌పూర్ గ్రామ సమీపంలో ఇన్నోవ కారును వేగంగా ఢీకొంది. దీంతో కారులో ఉన్న డ్రైవర్ రాంకుమార్‌తో పాటు మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై సాగర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలికి చేరుకున్నారు. కారు డ్రైవర్ పక్కనున్న మరో వ్యక్తి అందులోనే ఇరుక్కుపోవడంతో స్థానికుల సాయంతో అరగంటపాటు శ్రమించి బయటకు తీశారు. అంబులెన్స్‌లో క్షతగాత్రులను ఆసిఫాబాద్, అక్కడి నుంచి మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి ఫిర్యాదు అందలేదని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

కైరిగూడ ఓసీపీ సమీపంలో 'వనమహోత్సవం'

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీ సమీపంలో బుధవారం ఓసీపీ అధికారులు వనమహోత్సవం నిర్వహించారు. ఓసీపీ చెక్‌పోస్టు సమీపంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ మొక్కలు నాటారు. చెక్‌పోస్టు నుంచి గోలేటికి వెళ్లే దారిలో రోడ్డుకిరుపులా భారీగా మొక్కలు నాటారు. పీవో మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం వన మహోత్సవం కార్యక్రమానికి ప్రాధాన్యత కల్పిస్తోందన్నారు. ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఇంజనీరు వీరన్న, ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులు జీరో అకౌంట్ తెరవాలి

శ్రీరాంపూర్: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు బీమా పొందడానికి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో జీరో అకౌంట్ ఖాతాలు తెరవాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం సూచించారు. బుధవారం శ్రీరాంపూర్‌లోని సివిల్ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో, ప్రమాదవశాత్తు కార్మికుడు చనిపోతే బాధిత కుటుంబానికి రూ.20 లక్షల బీమా వర్తిస్తుందన్నారు. డెబిట్ కార్డు కలిగి ఉంటే 6 నెలలకోసారి స్వైపింగ్ చేసి ఉంటే అదనంగా మరో రూ.10 లక్షలు వస్తాయన్నారు. ఇంకా ఇతర సదుపాయాలు ఉంటాయన్నారు. నాయకులు అప్పారావు, జీ.శంకర్, వెంకన్న, శ్రీను, రాజేశ్, రాంబాబు, రాము, ఎల్లయ్య, కవిత పాల్గొన్నారు.

నిరుపేదకు ల్యాప్‌టాప్ విరాళం

జన్నారం: ప్రతిభకు పేదరికం అడ్డురాకూడదని, నిరుపేద ప్రతిభావంతునికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు ఉద్యోగులు ల్యాప్‌టాప్‌ను విరాళంగా అందజేశారు. జన్నారం మండలం కలమడుగు గ్రామానికి చెందిన శ్రీపెల్లి అశ్విన్‌కుమార్ తల్లిదండ్రులు అతని చిన్నతనంలోనే మృతి చెందారు. కుటుంబ సభ్యుల సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ అగ్రికల్చర్ యూనివర్శిటీలో ఎమ్మెస్సీలో అడ్మిషన్ పొందాడు. ల్యాప్‌టాప్ అవసరం కావడంతో భూగర్భ జల శాఖ ఉమ్మడి జిల్లా పర్యవేక్షకులుగా పనిచేసి ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉంటున్న అమర్‌నాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఉమ్మడి జిల్లా ఉద్యోగుల వాట్సాప్ గ్రూపులో విషయాన్ని తెలియజేశాడు. ఉద్యోగుల సహాయంతో రూ. 64 వేల విలువైన ల్యాప్‌టాప్ కొనుగోలు చేసి బుధవారం అందజేసినట్లు అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం



పంచనామా చేస్తున్న ఎస్సై

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గోపతి సురేష్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలం ములకల్ల గ్రామానికి చెందిన కోల శరత్‌కుమార్ (33)కు పది నెలల క్రితం వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థల కారణంగా పెద్దమనుషుల మధ్య విడాకులు తీసుకున్నాడు. తరచూ పంచాయితీలు జరగడం, తల్లిదండ్రులను మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తుండటంతో మనస్తాపానికి గురయ్యాడు. జీవితంపై విరక్తి చెంది బుధవారం ఇంట్లోనే సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా ఒకరి మృతి

పెంచికల్‌పేట్: మండలంలోని ఎల్కపల్లిలో అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఎల్కపల్లికి చెందిన తెలిగె రాజన్న (42)కు ఇరవై ఏళ్ల క్రితం దహేగాం మండలంలోని ఐనం గ్రామానికి చెందిన మంగతో వివాహమైంది. కుటుంబ కలహాలతో పదిహేనేళ్ల క్రితం భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. గ్రామంలోనే కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. రెండు రోజులుగా మృతుడు ఇంటి నుంచి బయటికి రాకపోవడంతో స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. తలుపులు తెరచి చూడగా కుళ్లిన స్థితిలో ఉన్న మృతదేహం కనిపించింది. మృతుని కుమారుడు అజయ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కొమురయ్య పేర్కొన్నారు.

ఆటో యూనియన్ జేఏసీ అధ్యక్షుడిగా రాంకుమార్

మంచిర్యాలటౌన్: ఆటో యూనియన్ జేఏసీ జిల్లా అధ్యక్షుడిగా బెల్లంపల్లి పట్టణానికి చెందిన కట్ట రాంకుమార్‌ను ఎన్నుకున్నారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, ఉపాధ్యక్షుడు మాతంగి శివరాజ్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. తమ యూనియన్ పార్టీలకు అతీతంగా పనిచేస్తుందని, ఆటో డ్రైవర్ల సమస్యలపై ఉద్యమించాలని ఈ సందర్భంగా వారు కోరారు.

ఉపాధ్యాయుని వెంట విద్యార్థులు రావడం అభినందనీయం



శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న రఘునాథ్ వెరబెల్లి

జన్నారం: బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయుని వెంట విద్యార్థులు రావడం అభినందనీయమని, ఇలాంటి ఉపాధ్యాయుడు సమాజానికి ఆదర్శమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి అన్నారు. ఇటీవల జన్నారం మండలం అక్కపెల్లి గూడకు బదిలీ అయిన ఉపాధ్యాయుడు జాజల శ్రీనివాస్ వెంట ఆ పాఠశాల నుంచి 141 మంది విద్యార్థులు వెళ్లిన విషయం తెలుసుకుని బుధవారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయున్ని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంకితభావంతో పనిచేస్తే ప్రజల్లో గుర్తింపు వస్తుందని చెప్పడానికి శ్రీనివాస్ ఉదాహరణ అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణ, నాయకులు కొంతం శంకరయ్య, గోలి చందు, ప్రవీణ్‌కుమార్, బెడద గోపాల్, సూర్యం, రమేశ్‌గౌడ్, చిట్టిబాబు, వీరాచారి తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాల సన్మానం

ఉపాధ్యాయుడు జాజల శ్రీనివాస్‌ను బుధవారం జన్నారం మండల బీసీ సంఘాల నాయకులు శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రుల హృదయాల్లో నమ్మకం ఏర్పర్చుకున్న ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు కొడూరి చంద్రయ్య, నర్సింహులు, లక్ష్మీనారాయణ, నర్సయ్య, శ్రీను, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుతో వృద్ధురాలు మృతి



ఎల్లమ్మ (ఫైల్)

రెబ్బెన(ఆసిఫాబాద్): మండల కేంద్రానికి చెందిన ఇప్ప ఎల్లమ్మ (71) బుధవారం పాము కాటుతో మృతి చెందినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే ఎల్లమ్మ వంటింట్లో బిందెలోంచి నీళ్లు తీస్తుండగా పక్కనే ఉన్న నాగుపాము వృద్ధురాలి కుడిచేతిపై కాటు వేసింది. కుటుంబ సభ్యులు పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కోడలు భారతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చోరీ కేసులో ఏడాది జైలు

నెన్నెల: చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష రూ.200 జరిమానా విధిస్తూ బెల్లంపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ముఖేష్ బుధవారం తీర్పునిచ్చారని ఎస్సై ప్రసాద్ తెలిపారు. 2022 జూలై 7న మైలారం గ్రామానికి చెందిన కంపెల శ్రీనివాస్ సాయిబాబా ఆలయంలోని హుండీ ఎత్తుకెళ్లి నగదు దోచుకున్నాడని పూజారి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు.

విద్యుత్ షాక్‌తో మహిళ మృతి

లక్సెట్టిపేట: విద్యుత్‌షాక్‌తో మహిళ మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని గుల్లకోటకు చెందిన పనాస లక్ష్మి (52) బుధవారం ఇంటి సమీపంలో సాగుచేసిన కూరగాయల మొక్కల్లో కలుపు తీస్తుండగా పక్కనే ఉన్న ఇనుప కంచె (ఫెన్సింగ్) కు విద్యుత్ షాకు రావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. స్థలం పక్కనే ఉన్న నర్సరీకి మోటర్ కోసం విద్యుత్ స్తంభం నుంచి సర్వీస్ వైర్ తీసుకున్నారు. ఫెన్సింగ్ వైర్ తాకుతుండటంతో విద్యుత్ వైర్ చెడిపోయి కరెంట్ సప్లై కావడంతో మృతి చెందినట్లుగా తెలిపారు. కొంత కాలంగా నర్సరీకి సంబంధించిన భూమి వారితో మృతురాలికి గొడవలు జరిగాయి. అప్పటి నుండి వ్యవసాయ భూమికి చెందిన అంజన్న, సత్యనారాయణ, నర్సరీ నిర్వహించే చిలుకయ్య వారిని చంపుతామని బెదిరించినట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. సీఐ నరేందర్ మృతదేహాన్ని పరిశీలించారు.